# యోషో

ఉదయం ఎనిమిదిన్నర అయింది. జి. టి. ఎక్స్‌ప్రెస్ మద్రాసు స్టేషన్ చేరి ఇంకా పూర్తిగా ఆగకుండానే తలుపు తెరుచుకొని ప్లాట్‌ఫారంమీదికి దూకాను. చేతిలో హాండ్‌బాగ్ భద్రంగానే ఉన్నదని దానివైపు ఓసారి చూసి రూఢిచేసుకొని స్టేషన్ బయటకు చేరాను. ఉద్యోగం, ఇంటర్వ్యూ — ఈ ఆలోచనలే తప్ప వేరే ధ్యాసలేదు. వెంటనే విశేషాచలంగారిని కలుసుకోవాలి. టాక్సీ చేసుకొని పాండీ బజార్లో దిగి ఓ హోటల్లో దూరి కాస్త కాఫీ తాగాను. అద్దంలో ఓసారి చూసుకొని ఓ.కె. అనుకొని బిల్లు చెల్లించి బయటికి వచ్చి నడక సాగించాను. ఆయన ఇల్లు ఎంతో దూరంలోలేదు.

విశేషాచలం ! ఓసారి నవ్వుకొన్నాను. అవును. ఆ ఇల్లే. గేటు ఓరగా వేసి ఉంది. నెమ్మదిగా తెరుచుకొని లోపలికి అడుగుపెట్టాను,అలాంటి ఇళ్ళలో ఆల్సేషియన్ ఉంటుందేమోనని భయం. కాని ఆ అలికిడేమీలేదు. ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉంది. దారికి రెండుపక్కలా క్రోటన్లు, బోగన్ విల్లాలు. రెండువైపులా విశాలమైన లాన్లు. వాటిమధ్య అక్కడక్కడ గులాబీలు. మంచి టేస్ట్ ఉన్న వ్యక్తే. నా కాలి జోళ్ళ మట్టితో ఆ ప్రదేశాన్ని కలుషితం చేస్తున్నానేమో ననే బెరుకుతో జాగ్రత్తగా నడిచి పోర్టికో చేరాను. కారుంది. ఇంట్లోనే ఉన్నాడన్నమాట. ఆ రోజు ఎప్పుడైనా సరే కలుసుకోవలసిందని ఉత్తరంలో రాశాడు. ఇంతలో ఎవరో నౌకరు కాబోలు అటువస్తే అడిగాను.

"విశేషాచలంగారున్నారా ?"

అతను జవాబుగా లాన్‌కి ఓ దిశగా తల ఎగరేశాడు. అటు చూశాను. కొంచెం దూరంలో నాలుగు గార్డెన్ కుర్చీలున్నాయి. ఓ కుర్చీలో ఓ భారీ మనిషి కూర్చుని పేపరు చూస్తున్నాడు. బట్టతల. పక్కన ఓ అమ్మాయి కూచుని ఉంది. ఆమెకూడా పేపరు చదువుతోంది. ఆమె ఎవరో? బహుశా ఆయన కుమార్తె ఏమో !

"వెళ్ళొచ్చా" సందేహిస్తూ అడిగాను.

మాటలు ఖర్చు చెయ్యటం ఇష్టం లేనట్టు అతను మళ్ళీ తల ఎగరేశాడు. దగ్గిరగా వెళ్ళి చేతులు జోడించాను.

"నమస్కారమండీ."

"కూర్చోండి." కళ్ళద్దాల్లోంచి పేపరు మీదగా చూసి ఆయన తలూపాడు. ఆమె ఓసారి తలెత్తిచూసి మళ్ళీ పేపర్లో తలదూర్చింది. ఆయన కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను.

"నా పేరు ప్రకాష్ అండీ. పర్సనల్ సెక్రెటరీ కావాలని మీరు ప్రకటిస్తే నేను దరఖాస్తు పంపాను. ఇవాళ ఇంటర్వ్యూకి రావలసిందని మీరు జాబు రాశారు."

"ఎస్ ఎస్ ప్రకాష్."

"అవును సార్ ఎసెస్ ప్రకాష్."

"నేనన్నది ఎస్ ఎస్ – అంటే అవునవునని - మీ ఇనిషియల్స్ కావు."

"సారీ సర్. నా అహం క్షమించండి." కొంచెం దెబ్బతిన్నాను. వెధవ 'ఇగో.'

"ఎందుకూ ? దోషం భాషది, మీది కాదు."

"భాషదేముందండి ?"

భాషది కాకపోతే మీదా, నాదా? ఇంకోసారి 'ఎసెస్ ప్రకాష్' అన్నాననుకోండి నేను ఎద్దేవా చేస్తున్నానని మీరనుకోవచ్చు, వ్యంగ్యం అనుకోవచ్చు, నిక్‌నేమ్ అనుకోవచ్చు."

"అదంతా అనుకోటంలో ఉంటుందండి," వినయంగా అన్నాను.

"అలా అనుకోటానికి ఆస్కారమిచ్చే భాషేం భాషయ్యా ? నాకు తెలీక అడుగుతా." అన్నాడాయన.

"భాషంటే భావాలకి మనమిచ్చే సాంకేతిక ప్రకటనే గదండీ." అన్నాను. ఆ అమ్మాయి చప్పున కలుగచేసుకొంది.

"మన నౌకరు మన పని మనం చెప్పినట్టు చెయ్యాలా ? భాష మన భావాన్ని యథాతథంగా బట్వాడా చెయ్యాలా, అక్కర్లేదంటారా ?"

"చెయ్యాలండి" కొంచెం బిడియపడి అన్నాను.

"చెయ్యకపోతే మన ప్రయోజనాన్ని నెరవేర్చేశక్తి దానికి పూర్తిగా ఉన్నట్టా లేనట్టా ?" రెట్టించాడాయన.

"లేనట్టే ననుకోండి."

"లేకపోబట్టే గదయ్యా ఇన్ని వ్యాఖ్యానాలూ, ఇన్ని తగాదాలూ, ఇన్ని కోర్టులూ....నానుస్తావేం ?" ఆయన ఏకవచనప్రయోగం ప్రారంభించేశాడు.

"హార్మోనియంలో 'స' మెట్టు మీరు నొక్కినా, నేను నొక్కినా 'స' గానే వినిపిస్తుంది. అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ అలాగే వినిపిస్తుంది. అలాగే రి, గ, మ, ప, ద, ని, అవునా ?" ఆమె గొంతులో సప్తస్వరాలు పలికాయి. ఒక్కక్షణం వాదన మర్చిపోయాను.

"అవునండి."

"ఎందుకంటారు ?,,

"ఎందుకండీ ?"

"అవి స్వరాలుగాని అక్షరాలు కావు కనుక." ఆమె మాట్లాడే అక్షరాలు నాకు స్వరాలుగానే వినిపిస్తున్నాయి. అయినా మెచ్చుకున్నట్టు తలూపాను.

"భాషకి నడుమూ లేదు,వెన్నెముకా లేదోయ్, దానిమీద ఆధారపడడం మనుషులకి మహాప్రమాదం."

"అవునండి. భాషని అభివృద్ధి పరచాలి."

"కాదు షూట్ చెయ్యాలి." తీవ్రంగా అన్నాడాయన.

అదిరిపడ్డాను. భాషా నక్సలైట్‌లా ఉన్నాడు మహానుభావుడు.

"మీవి విప్లవభావాలండీ."

"అని నువ్వు పొగుడుతున్నావో, తెగడుతున్నావో నీ భాషవల్ల తెలీదు. ఈ అర్థం పర్థం లేని భాషమీద నేను ఎదురుతిరిగాను, ఇన్ మై ఓన్ హంబుల్ వే. మా యశోద ఉంది చూశావూ, మా అమ్మాయి-అదే ఈ అమ్మాయే, పేరేమిటో తెలుసా? చిరునవ్వుతో ఆయన ఆ అమ్మాయి వైపు చూశాడు.

"యశోదగారన్నారు కదండి." నమ్రతగా అన్నాను.

"కాదు. యోషో."

"యోషోనాండి" అన్నా, తికమకపడి. యోషో ఏంపేరు !

"తమాషాగా ఉందా ?"

"లేదండి, బాగుందండి. నమస్కారమండి యోషోగారూ" కొంచెం ఇబ్బంది పడుతూ ఆమెవైపు తిరిగి చేతులు జోడించాను.

"నమస్కారం" ఆమె పెదవులమీద చిరు మందహాసం విరిసింది.

"యోషో అంటే అర్థం ఏమిటి ?"

"యోష అంటే స్త్రీ గదండి."

"యోష కాదయ్యా, యోషో ?"

"అంటే....?" బుర్ర గోక్కోసాగాను.

"ఇంగ్లీషు లాంగ్వేజ్ అండ్ లిటరేచర్‌లో ఎం. ఏ. పాసయ్యావు గదూ ?"

"పాసయానండీ — ఫస్ట్‌క్లాస్ కూడా వచ్చింది" నసిగాను.

"తెలుగుకూడా బాగా చదివావు కదూ ?"

తలూపాను.

"ఇంకా...."

"సంస్కృతంకూడా కొంచెం వచ్చండి, హిందీలోనూ ప్రవేశముందండి-"

"అయినా యోషో అంటే అర్థం తెలియదు."

"సారీ, తెలీదండీ."

"అసలు అర్థం ఉంటే గదయ్యా తెలియటానికి. అదేమరి నా తిరుగుబాటు. అసలీ ఐడియా ఎలా వచ్చిందో తెలుసా ?"

"అదంతా ఎందుకులే నాన్నా" ఆ అమ్మాయి విసుక్కుంది.

'ఐడియా లెప్పుడూ పరస్పరం వినిమయం చేసుకోవాలి. మాకో బెంగాలీ స్నేహితుడున్నాడోయ్. అతను మా అమ్మాయిని 'యోషోదో' అని పిలుస్తాడు. నాకు బ్రెయిన్ వేవ్ వచ్చింది. 'దో' తీసేశాను, అర్థం పోయింది. అందం వచ్చింది. అంతే, యోషో!" మురిసిపోసాగాడు, ఆ విప్లవవీరుడు. ఆ అమ్మాయికీ నవ్వువచ్చింది. నాకూ వచ్చింది.

"శేషాచలం, వి. అలాగే విశేషాచలం అయారు." ఆమె అందుకుంది.

"అది కొంచెం తక్కువస్థాయి విప్లవం, అందులోంచి ప్రకాష్‌లాంటి స్కాలర్ కొంత అర్థం లాగొచ్చు. సరే, అసలు విషయంలోకి వద్దాం. నువ్వు చూస్తే చాలా బుద్ధిమంతుడివిలా ఉన్నావోయ్ ప్రకాష్."

నా ముఖం చేటంతయింది. "థాంక్యూ సార్" అన్నాను.

"నువ్వెప్పుడూ ఏ పరీక్షగానీ తప్పలేదా ?"

"లేదండి. అన్నీ మంచి మార్కులతోనే పాసయాను."

'తెలిసో తెలియకో కాపీ కొట్టడం...."

' ఛ. ఛ. అలాంటిది నా జన్మలో లేదండి."

"పోనీ, ఇంకొకరికి కాపీ ఇయ్యటం జరిగిందా ?"

"లేదండీ. ఇలాంటి విషయాల్లో నేను చాలా స్ట్రిక్ట్."

"క్లాసులో అల్లరిచేసి సస్పెండవటం...."

"నెవర్."

"డబ్బుల్లేకుండా హోటల్లో కాఫీ తాగి పట్టుబడటం...."

"డబ్బున్నదీ లేనిదీ చూసుకోకుండా నేనెప్పుడూ హోటల్‌కి వెళ్ళనండి."

"ఎవరూ చూడకుండా సిగరెట్ తాగి దెబ్బలు తినటంవంటి...."

"ఇంతవరకూ సిగరెట్ పట్టుకొని ఎరగనండి."

"సినిమాకని ఇంట్లో చెప్పకుండా...."

"ఎప్పుడూ చెప్పకుండా పోలేదండి."

"అందరూ ఏవేవో వస్తువులు సాధారణంగా పోగొట్టుకుంటూంటారు. మరి నువ్వు...."

"నేను చాలా జాగ్రత్తగా ఉంటానండి. ఒక్క పెన్సిల్ ముక్కకూడా నే నెప్పుడూ పోగొట్టుకోలేదు."

"ఊఁహుఁ ! చాలా జాగ్రత్తగా పెరిగావన్నమాట. సరే గాని, నిజం చెప్పు— సైకిల్ లైట్ లేకుండా పోతేనో, డబుల్స్ రైడింగ్‌వల్లో పోలీసులు నిన్ను ఎప్పుడో పట్టుకొని ఉంటారు. అప్పుడెలా ఫీలయావు ?"

"నాకు సైకిల్ తొక్కటం రాదండి. ఎప్పుడూ సైకిల్ ఎక్కలేదు."

"ఎప్పుడైనా పడవ ప్రయాణం చేసి ఉంటావు — ప్రవాహం మధ్యలోకి వెళ్ళి నప్పుడు నీకెలాంటి అనుభూతి కలిగింది."

"పడవ ప్రయాణం ఎప్పుడూ చెయ్యలేదండి."

"ఈత వచ్చా ?"

"రాదండీ."

"ఆటల్లో ఎప్పుడన్నా దెబ్బలు తిన్నావుటయ్యా — గట్టి దెబ్బలు ?"

"అంత ఒళ్ళుమరిచి ఏ ఆటా ఆడలేదండి."

"ఎప్పుడైనా ట్రెయిన్ ఆక్సిడెంట్‌లో గాని, బస్ ఆక్సిడెంట్‌లో గాని నువ్వుండటం తటస్థించిందా?"

"ఉహుం."

"ఆ ఆక్సిడెంట్ల అంకెలన్నీ నీకు అర్థరహితాలే నన్నమాట. నువ్వెప్పుడైనా సోషల్ సర్వీస్ కార్యకలాపాల్లో పాల్గొన్నావా ?"

"లేదండీ....ఎక్కువగా చదువులోనే కాలం గడిపాను."

"చీట్లపేక ఆడతావా ?"

"బ్రిడ్జి నేర్చుకోవాలని ఈ మధ్యే పుస్తకం కొన్నానండీ. కానీ అసలు నాకు కార్డ్ సెన్స్ లేదు సార్."

"కథలు, గిథలు రాస్తావా ?"

"చదువుతానండి. రాసేదాకా రాలేదు."

"ఎప్పుడైనా ఏ ప్రమాదంలోనైనా చిక్కుకున్నావా ?"

వెంటనే నేనేమీ జవాబివ్వలేదు. ఏ ప్రమాదంలో చిక్కుకున్నాను? అయినా ఏమిటీ యక్షప్రశ్నలు ? ఈయన అభిప్రాయం ఏమిటి ?

"ఏం ?" ఆయన నావైపు దీక్షగా చూశాడు. నేను పెదవులు కదపబోయేంతలో నౌకరు వచ్చి "ట్రంక్‌కాల్ సార్" అన్నాడు.

"ఇప్పుడే వస్తా నుండవయ్యా" అని విశేషాచలం నౌకరు వెంట లోపలికి పోయాడు.

"ఏమండీ ట్రంక్‌కాల్ అన్నారు. ఏమైనా బిజినెస్ కాల్ అయ్యుంటుందా ?" ఆమెవైపు చూసి కొంచెం ఆదుర్దాగా అన్నాను.

"అవును. ఎప్పుడూ వస్తూనే ఉంటాయి."

"పోన్లెండి. ఎవరికన్నా ఏమైనా సీరియస్‌గా ఉందేమోనని భయపడ్డాను." ఆమె కొంచెం వింతగా నావైపు చూసింది.

"మీరు చాలా దూరంనించి వచ్చారా !"

"అవునండి. విజయవాడ నుంచి."

"ఉద్యోగం చాలా అవసరమా ?"

"చాలా అవసరమండి!" ఆమె వైపు ఆశగా చూశాను.

"కాని ఈ ఉద్యోగం మీకు దక్కేటట్టు లేదే."

"అలాగాండి. చాలా సిఫారసు లున్నాయా?" నిరుత్సాహంగా అన్నాను.

"ఉన్నాయి, మీకు వ్యతిరేకంగా."

"వాట్! నాకు అలాంటి శత్రువులెవరూ లేరండి." ఆశ్చర్యంగా అన్నాను.

"మీ సమాధానాలే. అన్నిటికీ లేదండీ, కాదండీ అంటే ఎలా సార్? ఎక్స్‌క్యూజ్‌మి. మీరు నవలలు చదవరా, సినిమాలు చూడరా? వాటిలో హీరోలు ఎలా డైనమిక్‌గా ఉంటారు? డైనమిజమ్ ఈజ్ ది సీక్రెట్ ఆఫ్ సక్సెస్." ఆమె లెక్చరిచ్చింది మహా చొరవగా.

ఆమె నా మంచి కోసమే చెప్పి ఉండవచ్చు. కాని నాకు కోపం వచ్చింది.

"నేను డైనమిక్కేనండి. 'చైతన్యం జీవిత చిహ్నం' అని నేను ఒక పెద్ద అముద్రిత వ్యాసం కూడా రాశాను" అన్నాను కొంచెం గర్వంగా.

"అయితే ఆ కథనే చెప్పండి" అందామె చులాగ్గా.

కథలా? అంటే! ఏమిటి ఈమె అభిప్రాయం!

"ఆఁ ఏదో బిజినెస్ కాల్‌లే. ఏమిటి నేను అడిగిన ప్రశ్న?" విశేషాచలం తిరిగివచ్చి కుర్చీలో జేరగిలబడుతూ నా వైపు చూశాడు.

"నేనేమైన ప్రమాద పరిస్థితుల్లో ఎప్పుడైనా చిక్కుకున్నానా అని-"

"ఆఁ ఆఁ - చెప్పు."

నేను గొంతు సవరించుకొన్నాను.

"పట్టుదల వల్లా, వినోద మనస్తత్వం వల్లా నేను కొన్ని సాహస చర్యలు చెయ్యాల్సి వచ్చిందండి - ఓసారి స్మగ్లింగ్‌లో వేలు దూర్చాను కూడా."

విశేషాచలం కుతూహలంగా కుర్చీలోంచి కొంచెం ముందుకి వంగాడు. ఆమె కూడా ఆసక్తితో ఓసారి నావైపు చూసి మళ్ళీ పేపర్ వైపు దృష్టి మళ్ళించింది.

"స్మగ్లింగే!" అన్నాడాయన ఆశ్చర్యంగా.

"ఔనండి. ఓసారి మిత్రులతో కలకత్తా టూర్ వెళ్ళినప్పుడు ఎరక్కపోయి యధాలాపంగా మన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కళ్లు కప్పటం ఏమంత కష్టం కాదు. అన్నానండి. మా మిత్రుల్లో ఓ తీవ్రవాది "ఆ మాటలు ఉపసంహరించుకో, లేకపోతే

పందెం వెయ్యి, బంగ్లాదేశ్‌కి నీ ఇష్టం వచ్చిన దొంగసరుకు రవాణాచేసి మాటలు రుజువు చేసుకుంటే వెయ్యి రూపాయిలిస్తాను. నువ్వు ఓడిపోతే నీ మాటలు ఉప సంహరించుకొని క్షమాపణ చెప్పుకుంటే చాలు" అన్నాడండి. నాకు రోషం వచ్చి పౌరుషం పెరిగిందండి. పందెం కాశానండి. ఓ బస్తా సరుకు స్కూటర్‌మీద కట్టి బయల్దేరానండి. సరిహద్దు రక్షణసైన్యం సరిహద్దు దగ్గర అటకాయించిందండి. బస్తా విప్పి చూపించమన్నారండి. చూపించానండి. సరుకు కిందపొయ్యమన్నారు. పోశా నండి. 'ఏమిటది' అని ఒకాయన గర్జించాడు సార్. త్రివేణి దగ్గిర గంగమట్టండి. బంగ్లాలో మా మిత్రుడి తండ్రి ఒకాయన మహా పూర్వాచార పరాయణుడున్నాడండి— చావు బతుకుల్లో ఉన్నాడు. పోయేముందు త్రివేణిదగ్గిర గంగమట్టి ఒళ్ళంతా పట్టించు కొని ప్రాణం విడవాలని ఆయన కోరిక. దయచేసి నన్నొదిలిపెట్టండి. ఆయన ఇంకా బతికి ఉంటే ఆయన చివరి కోరిక నెరవేర్చే అవకాశమివ్వండి." అని ప్రాధేయపడ్డాను సార్. "వీల్లేదు, నిన్ను అరెస్టు చేయవలసింది అసలు, దయతలచి వదిలిపెడుతున్నం దుకు సంతోషించు వెళ్ళు." అన్నాడండి ఆయన. 'ఈ మట్టి చేరవెయ్యటానికి అనుమతి ఇవ్వకపోతే ఆ ముసలాయన చచ్చి దయ్యమై మిమ్మల్ని పీక్కుతింటాడండి అన్నాను' ఆ అధికారి ముఖం చిట్లించి 'సరే పో' అన్నాడండి. మట్టి అంతా గోతాం లోకి ఎత్తుకొని బంగ్లాకి పోయి తిరిగొచ్చేనండి."

"మట్టి దొంగరవాణా వస్తువు కాదోయ్. అందులో గొప్పేముంది ?"

"నేను దొంగరవాణా చేసింది మట్టి కాదండి. సరికొత్త స్కూటర్."

"అం ఘటికుడివే !" ఆయన నోరు తెరిచి నా వైపు రెప్పవేయకుండా చూడ సాగాడు. ఆమె విస్మయంగా, మనసు సోదా చేస్తున్నట్టుగా తీక్షణంగా నావైపు చూసింది. నాకు గర్వం కలిగింది.

"ఇంకోసారేమైందో తెలుసాండి-"

ఆమె చప్పున లేచి నిలబడింది.

"నాన్నా, మనం మీ బెంగాలీ స్నేహితుడింటికి వెళ్ళాలని ప్రోగ్రాం వేసు కొన్నాం. టైమయింది."

"అవునవును. నువ్వు ఓ గంట వెయిట్ చెయ్యవోయ్. మళ్ళీ వచ్చి మాట్లాడ తాను." ఆయన కూడా లేచి నిలబడ్డాడు.

"అలాగే సార్. ఈ ఒక్క సంఘటన వినండి."

"ఊఁ చెప్పు" ఆయన కారువైపుకి నడవసాగాడు. ఆమె ముందే పోర్టికో వైపు అడుగు లేసింది.

"ఓ సారి రైల్లో మద్రాస్ వస్తున్నా సార్. తెల తెలవారుతుండగా నెల్లూరులో ఓ వ్యక్తి చేతిలో హాండ్‌బాగ్‌తో నా కంపార్ట్‌మెంట్‌లోకి అదరాబాదరాగా ఎక్కాడండి. చూడగానే పసికట్టాను. అతను స్మగ్లర్ !"

"ఎలా తెలుసు?" ఆయన వెనక్కి తిరిగి నావైపు చూశాడు.

"నేను స్మగ్లింగ్‌మీద కొన్ని పుస్తకాలు చదివానండి. అందువల్ల కొన్ని రహస్యాలు తెలుసు. స్మగ్లర్‌ని సులభంగా గుర్తుపట్టొచ్చు. అతని హాండ్‌బాగ్ కూడా నా హాండ్‌బాగ్ లాంటిదే. నాకు ఓ చిలిపి ఊహ కలిగింది. అసలే నాది ప్రమాదాన్ని ఆహ్వానించే తత్త్వం. నా ఊహ సరైందో కాదో తెలుసుకోవాలనిపించింది. నేర్పుగా హాండ్‌బాగ్‌లు మార్చేశాను. నా ఆశ్చర్యానికి అంతులేదు. సెంట్‌పర్సెంట్ కరెక్ట్ సార్. దాన్నిండా వాచీలూ, కలాలూ....ఫారిన్‌వి. నెమ్మదిగా అతన్ని అనుసరించి అతను బస చేసిన హోటల్ చేరి, రూమ్‌లోకి వెళ్ళి తలుపేసి మిస్టర్, నీ హాండ్‌బాగ్ ఓపెన్ చెయ్యి" అన్నాను. అతను యాంత్రికంగా బాగ్ తెరిచాడు. అతని ముఖంలో నెత్తురుచుక్కలేదు. దొంగసరుకుకి బదులు ఖద్దరు లాల్చీ, ధోవతీ ఉన్నాయి. వెంటనే నా చేతిలో పెట్టె తెరిచాను. "స్మగ్లింగ్ మానేసి మర్యాదగా నీతిగా బతుకుతావా, పోలీస్‌కి రిపోర్టివ్వనా" అని బెదిరించాను. అతడు కాళ్ళావేళ్ళా పడ్డాడు. "ఇదే మొదలండీ, ఇంకెప్పుడూ చెయ్యనండీ" అని అతను ప్రాధేయపడితే జాలివేసి, బుద్ధి చెప్పి వచ్చేశాను."

విశేషాచలం నావైపు కొంచెం అయోమయంగా చూశాడు. ఆమె కారు డోర్ తెరిచి స్టీరింగ్ సీట్‌లో కూర్చొంది. విశేషాచలం కారెక్కబోతుండగా వెనకనించి ఎవరో పిలిచారు.

"సార్, విశేషాచలంగారు మీరేనా ?" ఆయన వెనుదిరిగి చూశాడు. నేనూ చూశాను. పోలీస్ ఇన్‌స్పెక్టర్ !

"అవును, ఏం కావాలి మీకు ?"

"వీరెవరు ?" నన్ను చూపించి అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"పర్సనల్ సెక్రెటరీ పోస్ట్‌కి ఇంటర్‌వ్యూకి వచ్చారు."

"ఐసీ....మీ పేరు ఎస్. ఎస్. ప్రకాషా ?"

"అవునండి" అన్నాను ఆశ్చర్యంగా. నాపేరు ఈయన కెలా తెలిసింది ?"

"మీ హాండ్‌బాగ్ తెరవండి."

"ఎందుకండీ ?"

"తెరవండి" కొంచెం దౌర్జన్యంగా అన్నాడు ఇన్‌స్పెక్టర్.

నేను ముఖం చిట్లించుకొని "ఏమిటి ఈ దౌర్జన్యం ? సోదా చెయ్యదలిస్తే సెర్చివారెంట్ చూపండి" అన్నాను. ఆ మాత్రం ధైర్యం ప్రదర్శించకపోతే విశేషాచలం నాకేం ఉద్యోగమిస్తాడు !

"కాన్‌స్టేబుల్ ఆ హాండ్‌బాగ్ తెరు."

కాన్‌స్టేబుల్ దౌర్జన్యంగా నా చేతిలోంచి బాగ్ తీసి తెరిచాడు."ఈ దౌర్జన్యానికి మీరు క్షమాపణ చెప్పుకోవలసి వుంటుంది" అంటూ పెట్టెవైపు యధాలాపంగా చూసి అదిరిపోయాను. నా కాళ్ళకింద నేల జారిపోతున్నట్టయింది. అందరి ముఖాల వైపూ అయోమయంగా చూశాను. అందరూ నా వైపు తిరస్కార సూచకంగా చూస్తున్నారు.

"స్మగ్లర్ !" ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"ఈ బాగ్ నాది కాదండి. ఇందులో వాచ్‌లు ఉన్నాయి. నా బాగ్‌లో దుస్తులు తప్ప ఏవీ లేవండీ. రైల్లో మారిపోయి ఉంటుందండి" అన్నాను హీనస్వరంతో.

"అవన్నీ తర్వాత విచారణలోకి వస్తాయి. కస్టమ్స్ చట్టం సెక్షన్ 111 కింద మీరు నేరంచేశారని మా ఆరోపణ. మీసా కింద మిమ్మల్ని కస్టడీలోకి తీసుకొంటున్నాం. పదండి."

నేను పాతాళంలోకి కుంగిపోతున్నట్టు అనిపించింది. తలెత్తలేకపోతున్నాను. ఇదెలా జరిగింది?

"సార్, ఇన్‌స్పెక్టరుగారూ, నా మాట నమ్మండి. నేనేం నేరం చెయ్యలేదు. ఇదేదో పొరపాటునో, ఎవరో కావాలనో చేశారండి. నెల్లూరులో నా కంపార్ట్‌మెంట్‌లో ఎవరో ఇలాంటి హాండ్‌బాగ్‌తోనే ఎక్కారండి, అవును సార్. ఇది అతని పనే. నే నెప్పుడూ స్మగ్లింగ్ కాదుగదా, ఎలాంటి చట్టవిరోధమైన చర్యలూ చెయ్యలేదండి. విశేషాచలంగారూ, మీకు చెప్పినవి వట్టి కల్పిత కథలండీ. నిజం సార్. ప్లీజ్ నన్ను నమ్మండి. ఇన్‌స్పెక్టర్, నిజం కూపీ తీయించండి."

"మిమ్మల్ని అరెస్ట్ చేశామని చెప్పాను. పోలీస్ స్టేషన్‌కి పదండి."

అవమానభారంతో నా తల వాలిపోతోంది.

"విశేషాచలంగారూ, నా కిక్కడ ఎవరూ తెలీదండి. ఈ వార్త తెలిస్తే మా పేరెంట్స్‌కి గుండె పగిలిపోతుందండీ. నా నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకుంటాను. నాకు జామీనిచ్చి ఆ అవకాశం కల్పించండి సార్."

"జామీనా ? నో, నో, నో, సారీ," అన్నాడాయన కోపంగా, దృఢంగా.

"నేను నిజంగా నిర్దోషినండీ."

"ఎలా ?" అన్నాడాయన కర్కశంగా.

"మీరూ నమ్మరా ?" యోషో ముఖంలోకి చూశాను. ఆమె నావైపు అలాగే గుడ్లప్పగించి చూడసాగింది.

"ఎవరూ నమ్మరా ?" నిస్పృహతో అన్నాను.

"నీలాంటివాళ్ళని చాలామందిని చూశాం, ఇంక పద." ఇన్‌స్పెక్టర్ నా రెక్క పట్టుకొన్నాడు. నేను కోపంతో విదిలించుకున్నాను. "ఎందుకండీ ఇలా నన్ను వృథాగా బాధపెడతారు? నే నేం నేరం చెయ్యలేదు. నా మాట నమ్మండి." దృఢంగా, నిజాయితీ ఉట్టిపడేట్టు అన్నాను.

"కానిస్టేబిల్ !" ఇన్‌స్పెక్టర్ గర్జించాడు.

"ప్లీజ్. మీకు ఎలా చెప్పాలి? ఎలా చెప్తే మీకు నా నిజాయితీ, నా నిర్దోషిత్వం వెల్లడవుతుంది ! ప్రకాష్ ఏ నేరం చెయ్యలేదు, ప్రకాష్ హాజ్ డన్ నో క్రైమ్. ప్రకాష్‌నే కోయీ గల్తీ నహీఁ కీ. ప్రకాష్ కమపి అపరాధం న కృతవాన్. ఇంకెలా చెప్పాలి ? ఏ భాషలో చెప్పాలి ? ఎలా నా మనసు మీ ముందు పెట్టాలి ? యోషో ప్లీజ్ కమ్ టు మై రెస్క్యూ—ఇన్‌స్పెక్టర్—నన్నొదిలి అసలు దొంగని పట్టుకోడానికి ప్రయత్నించండి." నా ఆవేదనంతా వెళ్ళబోసుకున్నాను.

"చాల్లేవయ్యా కబుర్లు. ఇద్దరూ తోడుదొంగలే. మాకు ముందే ఆ రెండో అతని ఆచూకీ తెలిసి నిఘా వేశాం. అదెలాగో పసికట్టి మీరు బాగ్‌లు మార్చారు. అతని ఆరా తీసి వెళ్ళేసరికి హోటల్‌రూం తాళం వేసి ఎటో పోయాడు. అతని బాగ్ రూంలోనే ఉంది. సెర్చి చేశాం. అందులో ఇవాళ ఇంటర్‌వ్యూకి రమ్మని ఎస్. ఎస్. ప్రకాష్ పేర విశేషాచలంగారి జాబు ఉంది. ఇదో తంత్రం. ఏం అయన్ని కూడా

ఇందులో ఇరికించాలనే ప్రయత్నం - పద పద" ఇన్స్పెక్టర్ నా విన్నపం అంతా కొట్టిపారేశాడు. చేసేదిలేక విశేషాచలంవంకా యోషో వంకా జాలిగా చూశాను. ఆమె ఆఖరి క్షణంలోనైనా అడ్డుపడుతుందనుకున్నాను. కాని ఆమెలో చలనం లేదు. గుడ్లప్ప గించి నావైపు అలా తేరిపార చూడడమే తప్ప ఆమె నోటినుంచి ఒక్క మాటకూడా రాలేదు. చేసేదిలేక "పదండి" అని ఇన్స్పెక్టర్తో బరువుగా కదిలాను.

పోలీస్ స్టేషన్లో లాకప్ రూంలో కూర్చోగానే కసీ, మొండితనం నన్ను ఉక్కిరి బిక్కిరి చేశాయి. ఇక అబద్ధాలు రాబట్టటానికి హింసిస్తారు కాబోలు. ఏంచేస్తే అది చేసుకోనీ. నా జీవితం ఇక్కడే అంతమైనా సరే. ఇంక ఒక్కమాటమాట్లాడను. ఛీ. ఎంత మొరపెట్టుకున్నా ఒక్కరూ నా నిర్దోషిత్వం నమ్మలేదు. ఇదంతా అసలు ఆ యోషో వల్లే జరిగింది. డైనామిజంట డైనామిజం. లేనిపోని కట్టుకథలు నాచేత అల్లించింది. విశేషాచలం అందుకే నన్ను నమ్మలేదు. అయినా ఆశ్చర్యం. అలా జరిగిందేమిటి ? టాయిలెట్లోకి పోయినప్పుడు అతను బాగ్ మార్చాడు కాబోలు రాస్కెల్. ఆలోచనలతో తల దిమ్మెక్కిపోతోంది. ఇంతలో తలుపు తీసిన చప్పుడయి తలెత్తి చూశాను.

"ఇన్స్పెక్టర్ రమ్మంటున్నారు, పదండి" కాన్స్టేబుల్.

యాంత్రికంగా లేచి అతన్ని అనుసరించాను.

ఇన్స్పెక్టర్ టేబిల్ పక్కన విశేషాచలంని చూసి ఆశ్చర్యపోయాను.

"వీరు మీకు జామీనిచ్చారు. జామీనుమీద విడుదల చేస్తున్నాం. పిలిచినప్పుడు రావాలి. ఇంక వెళ్ళొచ్చు."

"థాంక్యూ సర్" అని ఇన్స్పెక్టర్వైపూ విశేషాచలంవైపూ చూసి అన్నాను. విశేషాచలం మాట్లాడకుండా లేచి నిలబడ్డాడు. అతనివెంట స్టేషన్ బయటికి వెళ్ళాను. ఆయన కార్లో కూర్చోమన్నాడు. నేను సందేహించాను. ఆయన చాలా పొడిగా అయిష్టంగా "కారెక్కు" అన్నాడు. చప్పున కార్లో కూలబడ్డాను.

"నువ్వు దోషివో నిర్దోషివో నాకు తెలీదు. యోషో నీకు జామీ నివ్వమని పట్టుబట్టింది. లేకపోతే మళ్ళీ నీ ముఖం చూడాలిసిన అవసరం నాకు పట్టేదికాదు" అన్నాడాయన కోపంగా, విసుగ్గా.

యోషో! నా మనసులో కృతజ్ఞతాభావం వెల్లివిరిసింది, ఇంటికి వచ్చేదాకా ఇంక ఆయన నాతో మాట్లాడలేదు. పోర్టికోలో కారాపి "నా జామీను ఉన్నంతవరకూ

నువ్వు ఇంకెక్కడికీ కదలటానికి వీల్లేదు. పోయి లాన్లో కూర్చో" అని డోర్ తెరుచుకుని దిగి దడాలున డోర్ వేసి ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

లాన్లో యోషో కూర్చుని ఉంది.

"థాంక్సండీ. గొప్ప సహాయం చేశారు. నా మాటల్లోని నిజాయితీ మీ ఒక్కరైనా గ్రహించినందుకు నాకు సంతోషంగా వుంది" అన్నాను.

"ఏ మాటలు?" అందామె.

"పోలీస్ ఇన్స్పెక్టర్ నన్ను అరెస్ట్ చేసినప్పుడు నేను మాట్లాడినమాటలండీ" అన్నాను.

"ఓ! ఆ మాట లేవీ నేను వినలేదు గదా!" అందామె.

"అదేమిటండీ, మీ ఎదుటే అంత సేపు నా కొచ్చిన భాషలన్నిటిలో కూడా నా నిజాయితీ గురించి చెప్పుకొన్నా గదండీ."

యోషో నవ్వింది.

"నేను డ్రైవర్ సీట్లో కూర్చుని తలుపేసుకోగానే ఈ గొడవంతా జరిగింది గదా. డోర్ అద్దం తియ్యాలని కూడా నాకు తట్టలేదు. మీ హావభావాలూ, మీ ఆంగిక విన్యాసం చూశానేగాని మీ మాటలూ, ఎవరి మాటలూ నాకు వినపడలేదు. ఎలా వినపడతాయి, అద్దం అడ్డుంటే!"

నాకు మతిపోయినంత పనయింది. అంత ఘోషా వృథాయే !

"మరి నాకు జామీనెందుకు ఇప్పించినట్టు?"

"మీరు వెళ్ళంతరువాత నాన్న చెప్పారు. మీరు జామీను ఇప్పించమని అడిగారనీ, తను నిరాకరించాననీ. నేను సిఫారస్ చేశాను."

"నా నిజాయితీ తెలీకుండానే సిఫారస్ చేశారా ?"

"తెలీకేం!"

"ఎలా తెలుసు నేను నిర్దోషినని....?"

"తెలుసు, కాని ఎలా తెలుసో తెలియదు."

ఆమెవైపు దీక్షగా చూశాను.

"ఎలా తెలుసో కూడా మీకు తెలుసు. దయచేసి చెప్పండి."

ఆమె నవ్వింది.

"అద్దం అడ్డుంటే మాటలు వినబడలేదు. లేకపోతే వినబడేవి. అలాగే మనుషుల కళ్ళకి అగోచరమైన తెరలు ఉంటాయి. ఆ తెరను దాటి మనసులు చదవొచ్చు."

"ఇదేమైనా వైజ్ఞానిక సిద్ధాంతమా?" సందేహంగా అడిగాను.

"యోషో సిద్ధాంతం" ఆమె గలగల నవ్వింది.

"యోషో, మీ మాటలకి అర్థం లేదు."

"యోషోకి అర్థం ఏమిటి?"

ఆమె సూటిగా నా కళ్ళలోకి చూసింది. అకస్మాత్తుగా ఆ కళ్ళలో ఏదో మెరుపు మెరిసినట్టయింది.

ఓహ్! యోషో, యోషో, ఇంక మాట్లాడను.

"ఇప్పుడే మీ నిజాయితీకి ప్రూఫ్ దొరికింది. కొద్ది నిముషాల కిందటే మీ బాగ్ మార్చిన వ్యక్తి మీకోసం వచ్చాడు. దాస్‌ప్రకాష్‌లో బసచేస్తున్నారనీ, అక్కడికి వెళ్ళి మీ బాగ్ తీసుకోవచ్చనీ చెప్పి, అతను వెళ్ళగానే పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేశాను. ఆటకట్టు." యధాలాపంగా అనేసి ఆమె చేతిలోకి పేపర్ తీసుకొంది. ఏదో అనాలని జిహ్వ తాపత్రయపడ్డది, గింజుకొంది, కొట్టుకొంది. చివరికి ఒకమాట మాత్రమే అనగలిగాను.

"యోషో!"

[యువ దీపావళి 1979]